క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె.రమేష్ లబ్ధిదారులకు సూచించారు. మిరియాపల్లి గ్రామంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను శనివారం పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకూ వర్షాల కారణంగా పనులకు అంతరాయం కలిగిందని.. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టినందున పనులను వేగవంతం చేయాలన్నారు.

నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన



నీమాస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: వరిపైరుకు సోకే రసం పీల్చే పురుగు నివారణకు నీమాస్త్రం బాగా పని చేస్తోందని ప్రకృతి వ్యవసాయం శాఖ లబ్బ యూనిట్ యాంకర్ గోవిందరావు అన్నారు. సోమరాజపురంలో నీమాస్త్రం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. దీన్ని వాడకం వల్ల పంటలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు తిరువీధి



ఉత్సవ మూర్తులకు తిరువీధి నిర్వహిస్తున్న భవానీ భక్తులు

సారవకోట: శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇందులో భాగంగా మండల కేంద్రమైన సారవకోటలో మోటార్, వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. అవలింగి శ్రీ నీలమణి అమ్మవారి ఆలయంలో శరన్నావరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు.

నేడు అల్లాడలో ఉచిత వైద్య శిబిరం

జలుమూరు: అల్లాడ గ్రామంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. శ్రీకాకుళంలోని సిందూర ఆస్పత్రి, బ్యాంకర్స్ కాలనీ భజన మండలి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు భజన మండలి ప్రతినిధులు రామారావు, రమణ శనివారం తెలిపారు. వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాణాల పండుగకు చిన్నారుల సన్నద్ధం



బాణాలు తయారు చేస్తున్న చిన్నారులు

సారవకోట: దసరా ఉత్సవాల్లోభాగంగా సరస్వతీ పూజ రోజున నిర్వహించే బాణాల పండుగకు మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఏటా ఈ పాఠశాల విద్యార్థులు సంప్రదాయాన్ని పరిరక్షించే ఉద్దేశంతో బాణాల పండుగను నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా శనివారం పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ ఆధ్వర్యంలో చిన్నారులు బాణాల తయారీలో నిమగ్నమైయ్యారు.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను కాపాడుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం విద్యార్థిని పిన్నింటి హేమలత అన్నారు. నరసన్నపేట, తామరాపల్లి, జమ్ము ప్రాంతాల్లో రైతులకు హేమలతతో పాటు ఇతర విద్యార్థులు మిత్ర పురుగలతో చేకూరనున్న లబ్ధిపై శనివారం అవగాహన కల్పించారు. పొలాల్లో రెండు రకాల పురుగులు ఉంటాయని అన్నారు. కొన్ని పంటలకు హాని కలిస్తాయని, మరికొన్ని మేలు చేస్తాయన్నారు. పొలాల్లో క్రిమి సంహారక మందులు వినియోగం తగ్గించి సస్యరక్షణ విధానాలు పాటించడం ద్వారా మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని వివరించారు. అలాగే పొలాల్లో పసుపు జిగురు అట్టలు వినియోగం ద్వారా మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని తెలిపారు.

నేడు అమ్మవారి కిరీటం ఊరేగింపు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణంలోని పాలపోలమ్మతల్లి అమ్మవారికి నూతనంగా బంగారు కిరీటాన్ని సిద్ధం చేశారు. దీన్ని ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని గాంధీజీ విగ్రహం నుంచి పాలపోలమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగించనున్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి వాణి పాల్గొంటారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- రొట్టవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



అవతరాబాద్‌లో సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. మండలంలోని అవతరాబాద్, రొట్టవలస గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. గత నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. సంక్షేమ పథకాలు వర్తించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారమార్గం చూపించారు. అర్హత ఉండి పథకాలు అందనివారు తమ దృష్టికి తెస్తే సమస్యను పరిష్కా మంజూరుకు చర్యలు తీసుకొంటానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ లావేటి అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, రొట్టవలస సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- పారాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పారాపురంలో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న రెడ్డి శాంతి

కొత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పారాపురం సచివాలయం పరిధి పారాపురం, కలిగాం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని తెలియజేశారు. నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో లంచాలు తీసుకుని అనర్హులకు, ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు మంజూరు చేసేవారని ఆరోపించారు. సీఎం జగన్ మాత్రం అర్హతే ప్రామాణికంగా.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పారాపురం, కలిగాం సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, సనపల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, కుంచాల సూకరాజు, లోతుగెడ్డ తిరుపతిరావు, పాపారావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, వి.సూర్యనారాయణ, సాధుబాబు, వైకుంఠరావు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా కొత్త వంట పాత్రలు



వాహనంలో నరసన్నపేటకు వచ్చిన వంట పాత్రల బాక్సులు

నరసన్నపేట: మండలంలో 82 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంటల కోసం కొత్త పాత్రలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని గురువారం నుంచి మండల కేంద్రాలకు అధికారులు చేర్చుతుండగా.. నరసన్నపేట మండలానికి శనివారం సాయంత్రం వచ్చాయి. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాఠశాలలకు వంట పాత్రలను ఇచ్చారు. తాజాగా ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసుతో వంట పాత్రలు మంజూరు చేశారు. రెండు నెలల నుంచే దీనిపై విద్యా శాఖ అధికారులు కసరత్తు చేశారు. అన్ని పాఠశాలలకు నాలుగైదు రోజుల్లో వీటిని పంపిణీ చేస్తామని ఎంఈవో శాంతారావు తెలిపారు.

ఆమదాలవలసలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీటాకీస్ వద్ద వరసిద్ధి వినాయక పంచమిరాత్రులను ఇటీవల నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసన్నపేట: చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నరసన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. మూడు రోజుల క్రితం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కోరుతూ విద్యార్థులకు డ్రీమ్ అండ్ డేర్ అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించగా.. దీంట్లో వంగ తేజేశ్వరి, పొట్నూరు దివ్యదాత్రి, పరస భవానీలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, ప్రతినిధులు సాయి శ్రీనివాస్, పొట్నూరు రమేష్, వీవీఎస్ఎస్ మూర్తి, ఊణ్ణ రంగనాథ్ పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



నిలిచిపోయిన వాహనాలు

సరుబుజ్జిలి: స్థానిక ఏబీ రోడ్డులో సరుబుజ్జిలికి సమీపంలో రోడ్డు మధ్యలో శనివారం లారీ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు కొద్దిసేపు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది బూర్జ మండలం మదనాపురం, సరుబుజ్జిలి మండలం తురకపేట, సవలాపురం జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగించారు. అనంతరం పోలీసులు వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించడంతో సమస్య పరిష్కారమైంది.

చరిత్రను ఇష్టంగా చదవాలి



మాట్లాడుతున్న సతీష్

నరసన్నపేట: చరిత్రను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవడం ద్వారానే విజయం సాధించగలమని చరిత్ర విషయ నిపుణుడు మాకినేని సతీష్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో చరిత్ర-సివిల్స్ సన్నద్ధత అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదలతో ముందుకెళ్తే విజేతలవుతారన్నారు. ప్రధానంగా చరిత్రపై పూర్తి అవగాహన ఉండడంతోపాటు ఇష్టంగా చదవాలన్నారు. ఉన్నత ఆశయం ఉంటే అదే చోదక శక్తిగా మారి మార్గాన్ని నిర్దేశిస్తోందన్నారు. ప్రామాణిక పుస్తకాలు, ఇంటర్ నెట్ ఆధారంగా తాజా పరిణామాలపై విశ్లేషనాత్మకంగా పట్టు సాధించాలని అప్పుడే సివిల్స్‌లో విజయం సాధించగలరన్నారు. డిగ్రీ స్థాయి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలన్నారు. అవగాహన సదస్సులో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సతీష్ సమాధానాలు ఇచ్చి వారిలో ఆసక్తిని పెంచారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గోవిందరావు



కొత్తూరు: భారతీ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కొత్తూరు గ్రామానికి చెందిన చోడవరపు గోవిందరావు నియమితులయ్యారు. ఈమేరకు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు ఇంత వరకు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేశారు. ఈయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఇండియా విజయం..మిన్నంటిన సంబరం



మనదే విజయం అంటూ విక్టరీ సింబల్ చూపుతున్న నరసన్నపేట సర్పంచ్ శంకర్, ఇతర క్రికెట్ అబిమానులు



మ్యాచ్‌ను తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు

నరసన్నపేట: వరల్డ్‌కప్‌లో భాగంగా శనివారం అహ్మదాబాద్ వేదికగా ఇండియా-పాకిస్తాన్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు అన్నివర్గాల వారు ఆసక్తి చూపారు. దాయాదుల మధ్య జరిగిన పోరులో ఇండియా విజయంతో నరసన్నపేట కాలేజీ మైదానంలో క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. డీకేఎస్ యూత్ ఆధ్వర్యంలో కాలేజీ మైదానంలో స్క్రీన్‌ను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఏర్పాటు చేయగా.. లైవ్‌ను క్రికెట్ అభిమానులు వీక్షించారు. పాకిస్తాన్ బౌలింగ్‌ను చిత్తు చేస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ సిక్స్‌లు, ఫోర్లు కొడుతుంటే యువత కేరింతలు కొట్టారు. చివరికి సునాయాసంగా పాకిస్తాన్‌పై ఇండియా విజయం సాధించడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. నరసన్నపేట సర్పంచ్ శంకర్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

మెరుగైన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ప్రసాద్ పండాను సన్మానిస్తున్న దృశ్యం

పాతపట్నం: ప్రజలకు మెరుగైన సేవలను అందించడం ద్వారానే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ దొర సావిత్రమ్మ అన్నారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని చెప్పారు. మండల ఈవోపీఆర్డీగా పని చేసి పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట ఎంపీడీవోగా పదోన్నతపై వెళ్లిన ఎన్.ప్రసాద్ పండాను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌లు, సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల సచివాలయ కన్వీనర్ ఎనుగుతల సూర్యం మాట్లాడుతూ.. ప్రసాద్ పండా కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలు మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఏపీవోలు, సూపరింటెండెంట్ తెంబురు రవి, సురేష్, తిరుపతి పట్నాయక్, రిటైర్డు ఎంపీడీవో సలాన చిరంజీవి, ఈవోపీఆర్డీ కృష్ణారావు, సెక్రటరీలు, మిశ్రో, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు తెలగవలస భజన మండలి



యాదగిరిగుట్టకు వెళ్తున్న భజన మండలి సభ్యులు

నరసన్నపేట: తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో భజనలు చేయడానికి మండలంలోని తెలగవలస బృందం శనివారం పయనమైంది. ఈ నెల 16న యాదగిరి గుట్టలో భజనలు చేయడానికి తెలగవలసకు చెందిన శ్రీ సీతారామ భజన మండలికి ఆహ్వానం వచ్చింది. రాను పోనూ ఖర్చులను ఆలయ కమిటీ ఇస్తోందని.. ఈ ఆలయంలో భజనలు చేయడానికి అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆర్గనైజర్ రాజు, బృందం ప్రతినిధి సత్యన్నారాయణ చెప్పారు. ఈమేరకు 20 మంది సభ్యులతో వెళ్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు సత్కారం



విక్రాంత్‌ను సత్కరిస్తున్న నాయకులు

కొత్తూరు: శాసనమండలిలో విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను కొత్తూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సత్కరించారు. పాలకొండలోని తన నివాసంలో మర్యాదపూర్వంగా కలిసిన నాయకులు దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. సచివాలయాల మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, బొడ్డేపల్లి రామకృష్ణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పంకజ దాస్, పీఏసీఎస్ డైరెక్టర్ గార రాజులునాయుడు, పి.నాయుడు ఉన్నారు.

నవరాత్రి మండపాలు సిద్ధం



సిద్ధమైన మండపం



ఆకట్టుకుంటున్న విద్యుత్ అలంకరణ

నరసన్నపేట: నరసన్నపేట మెయిన్ రోడ్డులో కాలేజీ కూడలికి ఎదురుగా దేవీ నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దుర్గాదేవిని ప్రతిష్ఠించేందుకు మండపాన్ని సిద్ధం చేశారు. జైదుర్గాభవానీ టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో రుత్వికులు మావుదూరు జగదీష్‌బాబు పర్యవేక్షణలో నవరాత్రులు జరగనున్నాయి. ఆదివారం ఉదయం పది గంటల నుంచి దుర్గాదేవిని భక్తులు దర్శించుకోవచ్చునని జగదీష్‌బాబు తెలిపారు. 24వ తేదీ వరకూ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండపం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే తోటాడ, ఉర్లాం కూడలి, మడపాం, మాకివలసల్లో కూడా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.

నాబార్డ్ నిధులతో వెయిటింగ్ హాల్

- పెదపాడు బాలికల అంబేడ్కర్ గురుకులం వద్ద నిర్మాణం
- తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడుకునేలా వెసులుబాటు



పెదపాడు బాలికల అంబేడ్కర్ గురుకులం వద్ద నిర్మించిన వెయింట్ హాల్



వెయిటింగ్ హాలులోని బల్లలు

శ్రీకాకుళం రూరల్:

నాబార్డ్ నిధులతో వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పెదపాడులోని బాలికల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాఠశాలకు వచ్చే తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడేందుకు ఇక్కడ గతంలో ఎలాంటి ఏర్పాట్లు ఉండేవి కావు. చెట్లు, గేటు, సెక్యూరిటీ రూమ్ తదితర ప్రాంతాల్లో నిల్చుని పిల్లలతో మాట్లాడాల్సి వచ్చేది. పండగ, పర్వదినాలు సమయంలో పిల్లలను చూసేందుకు వచ్చినప్పుడు పిండివంటలు అందివ్వడమే తప్ప తినిపించేందుకు సరైన వేదిక ఉండేది కాదు. ఈ నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం నాబార్డ్ నిధులతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు సైన్సు ల్యాబ్‌లు కట్టగా మిగిలిన సొమ్ము నుంచి తల్లిదండ్రుల వెయిటింగ్ హాల్ కట్టేందుకు నిర్ణయించారు. ఇందుకు నాబార్డ్ ప్రతినిధులు కూడా అంగీకరించారు. హాలుతో పాటు కొన్ని సిమెంట్ టేబుల్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

తుది దశకు పనులు..



మా స్కూల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 578 మంది పిల్లలు చదువుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చేటప్పుడు ఆరుబయటే ఉంటూ ఇబ్బందులు పడేవారు. దీంతో మాకు మంజూరైన బిల్డింగ్స్ ఫండ్ నుంచి వెయింట్ హాల్ కడుతున్నాం. పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరు నాటికి ప్రారంభిస్తాం.

– జ్యోతి, ప్రిన్సిపాల్, అంబేడ్కర్ గురుకులం

మహిళా రైతుకు రైతు నేస్తం అవార్డు



వెంకయ్యనాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న వరలక్ష్మి

బూర్జ : మండలంలో గల రామన్న పేట గ్రామానికి చెందిన పనస వరలక్ష్మి అనే ప్రకృతి వ్యవసాయ రైతుకు రైతు నేస్తం అవార్డు వరించింది. శనివారం 19వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా గన్నవరం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

మండల దీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిరంలో భక్త బృందం ఆధ్వర్యంలో హరి నామ సంకీర్తన మండల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. భాద్రపద బహుళ అమావాస్య నుంచి నవంబరు 24 కార్తిక శుద్ధ ఏకాదశి వరకు 41 రోజుల పాటు దీక్షలు జరుగుతాయని భక్త బృందం ప్రతినిధులు పేర్కొన్నారు. 50ఏళ్లుగా దీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు.